క్లుప్తంగా

విగ్రహాల ఏర్పాటుకు రూ.30వేల విరాళం



విరాళం అందిస్తున్న దాత సూరమ్మ

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామంలో పునర్నిర్మాణం జరుగుతున్న గీతా మందిరంలో కృష్ణార్జునుల విగ్రహాల ఏర్పాటుకు గ్రామానికి చెందిన కెంగువ సూరమ్మ రూ.30,000వేలు విరాళంగా అందించారు. గీతామందిర నిర్మాణకర్త గంట సాధుకు ఈ విరాళాన్ని ఆదివారం అందజేసి మందిరాన్ని బాగా తయారుచేయాలని, అందరికీ భక్తి మార్గాన్ని సూచించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఈర్ల సంజీవినాయుడు, కె.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అమరజీవికి నివాళులు



నేతాజీ గ్రంథాలయం వద్ద అమరజీవి చిత్రపటానికి పూలమాలలువేసిన గ్రామస్తులు

బలిజిపేట: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని పెదపెంకి నేతాజీ గ్రంథాలయం వద్ద ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరజీవి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంజీవనాయుడు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల గుండె చప్పుడని కొనియాడారు. అటువంటి మహనీయుని చరిత్ర విద్యార్థులకు తెలియపరచాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆనందరావు, ఇ.సాధు, జి.సింహాచలం, పి.మురళి, ఎం.శంకరరావు ఆచారి, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నగర సంకీర్తన



సంగంవలసలో నగర సంకీర్తన చేస్తున్న సాయిభక్తులు

పార్వతీపురం: మండలంలోని సంగంవలస గ్రామంలో ఆదివారం వేకువజామున సాయి బాబా నగర సంకీర్తన కార్యక్రమాన్ని సాయిభక్తులు నిర్వహించారు. దత్తాత్రేయ జయంతి సందర్భంగా సాయి భక్తులు గ్రామంలోని పలు వీధుల్లో నగర సంకీర్తన చేసుకుంటూ సాయి బాబాను కీర్తించారు. ఈ మేరకు గ్రామంలో పలువురు బాబాను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోండి



వెంగాపురం సంతతోట వద్ద అవగాహన కల్పిస్తున్న ఎస్సై సింహాచలం

బలిజిపేట: ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై సింహాచలం సూచించారు. హెల్మెట్ వినియోగంపై వాహన చోదకులకు ఆదివారం ఆయన అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనంపై ప్రయాణించడం నేరమని, ఎటువంటి ప్రమాదాలు జరిగినా ప్రాణాపాయం కలుగుతుందన్నారు. ప్రాణరక్షణ నిమిత్తం హెల్మెట్ ధరించాలని పిలుపునిచ్చారు. హెల్మెట్ లేని వాహనచోదకులకు అపరాధరుసుము విధించనున్నామన్నారు. దీనిని వాహనచోదకులు గుర్తించి పోలీస్‌శాఖకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో రహదారి ప్రమాదాల నివారణ

- పోలీస్ యంత్రాంగం కృషి
- పార్వతీపురంలో నిత్యం జాగ్రత్తలు సూచిస్తున్న సిబ్బంది
- యువతకు కౌన్సెలింగ్
- నిదానమే ప్రధానమంటూ ప్రచారం
- హెల్మెట్ ధరించాలని వినతి



పార్వతీపురం పట్టణంలో అవగాహన కల్పిస్తున్న పోలీసు సిబ్బంది

పార్వతీపురంటౌన్:

రహదారి ప్రమాదాల నివారణకు పార్వతీపురం పోలీస్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. నియోజకవర్గంలో పార్వతీపురం టౌన్, రూరల్, సీతానగరం, బలిజిపేట ప్రాంతాల్లో అధిక సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనాలు అతి వేగంగా రావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి ఆదేశాలతో ప్రధాన రహదారుల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేశారు. ప్రజల భాగస్వామ్యంతో రహదారి ప్రమాదాల నివారణకు కృషి చేయవచ్చని పోలీసు యంత్రాగం చెబుతోంది.

● మైనర్స్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి

నియోజకవర్గంలో ప్రతిరోజూ సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తున్నారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మైనర్లు కొత్తగా వాహనాలు నడుపుతూ పరిమితికి మించి వేగంగా డ్రైవ్ చేస్తున్నారు. అటువంటి సమయంలో రోడ్డు ప్రమాదాలు జరిగి మృత్యువాత పడే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు 18 సంవత్సరాలు పైబడి, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వ్యక్తులు మాత్రమే వాహనాలు నడపాలని సూచిస్తున్నారు. మొదటిసారి వాహనం నడుపుతూ పట్టుబడితే జరిమానా, రెండోసారి పట్టుబడితే జరిమానాతో పాటు వాహనం సీజ్ చేసి కోర్టులో హాజరుపరుస్తున్నారు.

వాహనదారుడు మద్యం తాగినట్లు కోర్టులో రుజువైతే రూ.12 వేలు జరిమానా, జైలుశిక్ష విధిస్తున్నారు. నిబంధనలు పాటించని వాహన చోదకులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ లేని వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.

హెల్మెట్ ధరిస్తే ప్రాణాపాయం ఉండదు



రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ప్రధాన రహదారుల్లో నిత్యం వాహన దారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా మీరు బాగుంటేనే మీ కుటుంబం బాగుంటుందనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తున్నాం. వివిధ రోడ్డు ప్రమాదాల్లో కుటుంబాన్ని పోషించే పెద్ద చనిపోతే ఆ కుటుంబం రోడ్డున పడే పరిస్థితి తలెత్తుతోంది. అందుకని మీపై ఆధారపడ్డ వారి కోసమైనా మీరు హెల్మెట్ ధరించాలని, నిదానంగా ప్రయాణించాలని కోరుతున్నాం.

– ఎం. గోవింద్, ఎస్సై, పార్వతీపురం టౌన్

ప్రమాదాల నివారణే లక్ష్యంగా



రోడ్డు ప్రమాదాల నివారణకు నిత్యం కొంత సమయాన్ని కేటాయిస్తున్నాం. వాహనదారులు, ఆటో డ్రైవర్లకు నిత్యం రహదారులపై అవగాహన కలిగించే ప్రయత్నం చేస్తున్నాం. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరుతున్నాం. ద్విచక్ర వాహన ప్రమాదాల్లో అధికశాతం తలకు గాయాలై ప్రాణాలు పోతున్నాయి. దీంతో హెల్మెట్ తప్పనిసరి అంటూ ప్రచారం చేస్తున్నాం.

– పాపయ్య ఎస్సై, పార్వతీపురం ట్రాఫిక్

అవగాహన కల్పిస్తున్నాం



రోడ్డు భద్రతా చట్టాలపై రోడ్డు వినియోగదారులకు అవగాహన కలిగిస్తున్నాం. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. ఎప్పటికప్పుడు మైనర్లకు వారి తల్లిదండ్రుల సమక్షంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వ్యక్తులు మాత్రమే వాహనాలు నడపాలి, ప్రభుత్వ ఆదేశాల మేరకు ద్విచక్ర వాహన చోదకులు వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలి.

– మురళీధర్, సీఐ, పార్వతీపురం టౌన్

● ఆటో డ్రైవర్లకు అవగాహన

ఆటోల్లో మితిమీరిన ప్రయాణికులను ఎక్కించినా, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు తరలించినా నేరమని ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తున్నారు. జాతీయ రహదారుల వెంబడి ఉన్న దాబాల వద్ద వాహనాలు నిలిచిపోకుండా ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నారు.

నేరాల నివారణకే 'సంకల్పం' సదస్సులు



కాశీపేటలో మాట్లాడుతున్న ఏఎస్సై ఎల్. శ్రీనివాసరావు

సీతానగరం: గ్రామాల్లో అక్కడక్కడ జరుగుతున్న నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించడానికి సంకల్పం గ్రామ సభలు దోహద పడుతున్నాయని ఏఎస్సై లంక శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని కాశీపేట, కాలనీల్లో ఆదివారం సంకల్పం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నేరాలు నివారించడానికి ముందుగా మహిళలు చైతన్యవంతులు కావాలని కోరారు.అలాగే గ్రామాల్లో అందరూ విద్యావంతులు కావాల్సిన అవసరంఉందని, అందరూ ఆర్థికంగా,సామాజికంగా అభివృద్ధి చెందినప్పుడే నేరాలు నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు, పొదుపుసంఘాల సభ్యులు, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్‌నేరాల పట్ల అప్రమత్తం



చినభోగిలి వద్ద రాష్ట్ర రహదారిలో మాట్లాడుతున్న ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: జిల్లాలోని పలుప్రాంతాల్లో దుండగులు, నేరగాళ్లతో జరుగుతున్న సైబర్ నేరాల నిర్మూలన, రోడ్డు ప్రమాదాల నివారణ పట్ల ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. ఈ మేరకు మండలంలోని రాష్ట్ర రహదారిలో చినభోగిలి సమీపంలో ఆదివారం వాహన చోదకులు, ప్రయాణికులతో సైబర్‌నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంకల్పం కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాలమేరకు ప్రస్తుతం గ్రామాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించామన్నారు. గ్రామాల్లో ప్రజలు తమబ్యాంక్ ఖాతాల్లో ఉంచుకున్న డబ్బును చోరీ చేయడానికి ఖాతాదారులకు నగదు బహుమతులు వచ్చా యని మీకు వచ్చిన నగదును అకౌంట్‌లో చేయడానికి ఆధార్ నంబర్ చెప్పాలని, మీ ఫోన్ నంబర్‌కు వచ్చిన ఓటీపీ నంబర్ చెప్పాలని అడుతారని, అత్యాశకు ప్రజలు పోరాదని హితవు పలికారు. అటువంటి ఫోన్ నంబర్‌లు వస్తే సమీపంలో ఉన్న పోలీస్ వారికి తెలియజేయాలని సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్, కార్లు నడిపే వారు సీటు బెల్టు ధరించి ప్రయాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహన చోదకులు పాల్గొన్నారు.

17న జాతీయ పెన్షనుదారుల దినోత్సవం

పార్వతీపురంటౌన్: డిసెంబర్ 17న జాతీయ పెన్షనుదారుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లా పెన్షనర్ల అసోసియేషన్ కార్యదర్శి డి.గణపతిరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా పార్వతీపురం పట్టణంలోని రైతు బజార్ దరిలో ఉన్న పార్వతీపురం మన్యం జిల్లా పెన్షనర్ల అసోసియేషన్ భవనంలో ఈ నెల 17 ఉదయం 10 గంటలకు ఘనంగా జాతీయ పింఛన్ దారుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా 75 సంవత్సరాలు నిండిన పింఛను దారులను సన్మానిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పింఛను దారులందరూ పాల్గొని పెన్షనర్స్ డేని విజయవంతం చేయాలని కోరారు.

ఘంటసాల కారణజన్ముడు

- మంత్రి సంధ్యారాణి



ఘంటసాలకు నివాళులు అర్పిస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు: సినీ సంగీత నేపథ్య గాయకుడు దివంగత ఘంటసాల కారణ జన్ముడని స్త్రీ,శిశుసంక్షేమ,గిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ఈ మేరకు సాలూరు పట్టణంలోని ఎన్‌జీఓ రిక్రియేషన్ క్లబ్‌లో జరుగుతున్న ఘంటసాల ఆరాధనోత్సవాల కార్యక్రమంలో ఆదివారం ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఘంటసాల సంగీత సామ్రాజ్యానికి చేసిన కృషిని ఎవరూ మరిచిపోలేరని కొనియాడారు. ఘంటసాల విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆరాధనోత్సవాల్లో పలువురు గాయకులు పాడిన ఘంటసాల పాటలు శ్రోతలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పలువురు నాయకులు, ఘంటసాల అభిమానులు పాల్గొన్నారు.

చెరకుతూనిక యంత్రం ప్రారంభం



తూనికయంత్రంలో వాహనాల తూకం వేస్తున్న సిబ్బంది

సీతానగరం: సంకిలిలోని ఈఐడీప్యారీస్ సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం సమకూర్చిన చెరకు తూనిక యంత్రాన్ని చెరకు అభివృద్ధి శాఖ డీజీఎం(కేన్)మురళి ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం సీతానగరం మండలంలో ప్రారంభించారు. ఇప్పటికే బూర్జ, వెంకటాపురం, ఏగోటివలస గ్రామాల్లో చెరకు తూనిక యంత్రాలు పని చేస్తున్నాయి.కృష్ణారాయపురం గ్రామ చెరకు రైతుల కోరిక మేరకు నూతనంగా చెరకు తూనిక యంత్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు రైతునాయకులు జి.సింహాచలం, జి.వెంకటరమణ మాట్లాడుతూ పెదంకలాం, కృష్ణారాయపురం గ్రామాల్లో చెరకు సాగు విస్తీర్ణం పెరుగుతున్న కారణంగా తూనికయంత్రాన్ని యాజమాన్యం నెలకొల్పడం అభినందనీయమన్నారు. చెరకు తూనిక యంత్రం ఏర్పాటుతో ఈఐడీప్యారీస్ (సంకిలి సుగర్ ఫ్యాక్టరీ)నుంచి లారీలు కేటాయించడం వల్ల చెరకు లోడ్ చేయడం ప్రారంభించామన్నారు.

ముమ్మరంగా వరిచేల నూర్పిడి



యంత్రంతో వరిచేను నూర్పిడి చేస్తున్న రైతులు

సీతానగరం: మండలంలో పండించిన వరిచేనుపంట మడులలో వేసిన వరికుప్పలు యంత్రాలతో నూర్పిడి చేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఈ మేరకు కాశీపేట,అంటిపేట, బుడ్డిపేట, వెంకటాపురం,బూర్జ, చెల్లంనాయుడువలస, పెదంకలాం, నీలకంఠాపురం గ్రామాల్లో ఆదివారం గ్రామాల కళ్లాలు, మడులలో భద్రపర్చిన వరిచేను కుప్పల వద్ద యంత్రాలను, ఖాళీ సంచులు, తూనిక యంత్రాన్ని ఏర్పాటు చేసుకుని వరిచేను పంట నూర్పిడి చేపట్టారు. బుడ్డిపేట గ్రామానికి చెందిన రాంబాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ నూర్పిడి చేసిన ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేయాలని కోరుతున్నామన్నారు. రైతుల నుంచి మిల్లర్లు బ్యాగ్ పట్టుబడి 41 కేజీలకు మించి ఉండరాదన్న జిల్లా ఉన్నతాధికారులు సూచనల మేరకు ఏఓ ఎస్ అవినాష్ ద్వారా ధాన్యం మిల్లులకు తరలించే పనుల్లో రైతులు సిద్ధంగా తెలియజేశారు.

అమరజీవి ఆశయాలను కాలరాస్తున్న ప్రభుత్వం



సాలూరు: పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు:

తెలుగు జాతి కోసం ఆత్మబలిదానం చేసిన అమర జీవి పొట్టి శ్రీరాములు ఆశయాలను టీడీపీ కూటమి ప్రభుత్వం కాలరాస్తోందని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర విమర్శించారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన సాలూరు పట్టణంలోని తన స్వగృహంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలుగుమాట్లాడే వారందరికి ఓ రాష్ట్రం కావాలని ఆత్మబలిదానం చేసిన మహోన్నత వ్యక్తి శ్రీరాములు అని కొనియాడారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటుచేయాలన్నది ఆయన ఆశయాల్లో ఒకటని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్, వైఎస్సార్‌సీపీ సాలూరు పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గిరిరఘు, మద్దిల గోవింద, తాడ్డి యశోద కృష్ణ, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు

పార్వతీపురంటౌన్: తెలుగు ప్రజల హృదయాల్లో ఎప్పటికీ చిరస్మరణీయంగా మహనీయుడు పొట్టి శ్రీరాములు నిలిచిపోతారని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతిని పురస్కరించుకుని తన క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్వతీపురం, సీతానగరం మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బొమ్మి రమేష్, బొంగు చిట్టి రాజు, జెడ్పీటీసీ ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, ఎంపీపీ ప్రతినిధి మజ్జి శేఖర్, వైస్‌ఎంపీపీలు సిద్ధా జగన్నాథరావు, బంకురు రవికుమార్, సర్పంచ్ యాళ్ల ఈశ్వర ప్రతాప్, నాయకులు బూతాల వెంకటరమణ, కోల చిరంజీవి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సీతానగరం: మండలకేంద్రంలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్యులు



పార్వతీపురం టౌన్: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐటీడీఏ ఏపీఓ ఏ మురళీధర్



పార్వతీపురం టౌన్: పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

విద్యుత్ బిల్లులు చెల్లించలేం..



పాలకొండ రూరల్: మల్లమ్మగూడలో సీపీఎం నేతృత్వంలో గిరిజనుల ఆందోళన

పాలకొండ రూరల్: కూటమి ప్రభుత్వంలో పెరిగిన విద్యుత్ బిల్లులను చెల్లించలేమని మండలంలోని సింగన్నవలస పంచాయతీ మల్లమ్మగూడ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక సీపీఎం నాయకులు గిరిజనులతో కలిసి ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యుడు ఎ.భానుచందర్ మాట్లాడుతూ.. నాడు ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పిన ఆరు నెలలకే చార్జీల మోత మోగించారన్నారు. ట్రూఅప్ చార్జీల పేరిట, ఇతర చార్జీల పేరిట బడుగులపై భారం మోపడం అన్యాయమని చెప్పారు. తక్షణమే విద్యుత్ చార్జీలు తగ్గించాలని లేకుంటే ప్రజా పోరాటం తప్పదన్నారు. కార్యక్రమంలో చెంప, సాంబయ్య, చిన్నారువు, మజ్జియ్య, సింహాచలం, రమేష్ తదితరులున్నారు.



భామిని: బాలేరులో విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భారం మోపడం తగదు..

భామిని: ప్రజలపై విద్యుత్తు భారం మోపడం తగదని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు మండలంలోని బాలేరులో నిరసన వ్యక్తం చేస్తూ, విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి.. ఇప్పుడు పెంచడమేమిటని ప్రశ్నించారు. వెంటనే కూటమి ప్రభుత్వం స్పందించి పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొత్తకోట చంద్రశేఖర్, జామి ప్రభాకర్, మేడిబోయిన చలపతి, దామోదర కంఠయ్య, బోడాల చిన్నయ్యదొర, కొత్తకోట ఆంజనేయులు, మడపాన కృష్ణ పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదానం ప్రారంభం



భక్తులకు ప్రసాదాన్ని వడ్డిస్తున్న మావుడి సోదరులు

మక్కువ: మండల కేంద్రం లోని జగనన్న కాలనీ సమీపంలో నిర్మిస్తున్న వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నిత్యాన్నదానం కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగు నాయుడులు హాజరై ప్రారంభించారు. భక్తులకు స్వామివారి ప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదానం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. భక్తులకు స్వామివారి ప్రసాదం ప్రతిరోజూ అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మావుడి తిరుపతి నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.